# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 19 జూన్ : 2017 విడుదల : 10


**ఎవడును కీడునకు ప్రతికీడు**

**ఎవనికైనను చేయకుండ చూచుకొనుడి.**

**మీరు ఒకనియెడల ఒకడును**

**మనుష్యులందరి యెడలను**

**ఎల్లప్పుడు మేలైనదానిని**

**అనుసరించి నడుచుకొనుడి.**

**ఎల్లప్పుడును సంతోషముగా ఉండుడి.**

**యెడతెగక ప్రార్థన చేయుడి.**

**1థెస్స.5:15**

**పరిపూర్ణ విడుదల**

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

జూన్ - 2017

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.100/-

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-9 |
| 2. | యెడతెగక.. | 10-11 |
| 3. | నిర్ణయం | 12-18 |
| 4. | సీమోను... | 19 |


## సువార్త ఉజ్జీవ కూటములు

| | |
|---|---|
| 2017 జూన్ 12,13,14 | హిందూపురం,<br>C.&I.G. మిషన్ చర్చ్ కాంపౌండ్ |
| 2017 జూన్ 15,16,17 | మదనపల్లి,<br>C.S.I మిషన్ కాంపౌండ్ |
| 2017 జూన్ 18 | చేబ్రోలు, నూతనమందిర ప్రతిష్ఠారాధన<br>సబ్ స్టేషన్ ప్రక్కన. |

# ఎడిటర్ అర్పణ

మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా వందనములు.

**"నిత్యము భయముగలిగి ప్రవర్తించువాడు ధన్యుడు హృదయమును కఠినపరచుకొనువాడు కీడులో పడును"**

– సామెతలు 28:14

మన జీవితం చాలా విలువైనది దానికి సమమైనది ఏదియు లేదు. మన జీవితమును ఒక త్రాసులోపెట్టి తూచినట్లయితే దానితో మరేదియు సరితూగదు. సర్వలోకాన్ని తీసికొనివచ్చి త్రాసులోపెట్టినా మన ప్రాణం, మన జీవితమే గొప్పదని దేవుని వాక్యం సెలవిస్తుంది. ఇంత విలువైన జీవితం ప్రభువు మనకు ఇచ్చినప్పుడు దానిని ఎంత భద్రముగా మనము కాపాడుకొంటున్నాము? ఉదయం లేచిన దగ్గర నుండి సాయంత్రం పండుకొనేవరకు నిత్యము మనము దేవుని భయము కలిగి ఉండాలి అని వాక్యము సెలవిస్తుంది. మన జీవితకాలములో దేవుని భయము లేకుండా ఒక్క అడుగు ప్రక్కకు వేసినను దానిని సరిచేసికొనవచ్చునేమో కాని దాని వలన వచ్చే నష్టమును ఎన్నడు పూడ్చలేము. నీ జీవితంలో ఆ దైవికమైన భయం ప్రభువు నీకిచ్చారా? ఆ భయం లేకపోతే ఎలా ఉంటుంది? భయం ఉంటే ఎలా ఉంటుంది? మనము నిత్యము దేవునియందు భయము కలిగి ఉన్నప్పుడు మనము వెళ్ళేటువంటి త్రోవ మనకెటువంటి క్షేమమిస్తుంది? ఒకవేళ భయము లేకపోతే మన జీవితాలు ఏమౌతాయి? వాక్యపు వెలుగులో ధ్యానము చేద్దాం!

**"యాకోబు తన తల్లి సహోదరుడైన లాబాను కుమార్తెయగు రాహేలును, తన తల్లి సహోదరుడగు లాబాను గొఱ్ఱెలను చూచినప్పుడు అతడు దగ్గరకు వెళ్లి బావిమీదనుండి రాతిని పొర్లించి తన తల్లి సహోదరుడగు లాబాను గొఱ్ఱెలకు నీళ్లు పెట్టెను. యాకోబు రాహేలును ముద్దుపెట్టుకొని యెలుగెత్తి యేడ్చెను."** ఆది.29:10. యాకోబు రాహేలును ముద్దుపెట్టుకొనవలసిన అవసరం లేదు.

రాహేలు యాకోబు యొక్క మేనమామయైన లాబాను కుమార్తె. యాకోబు తన అన్నయైన ఏశావును మోసం చేశాడు అందునుబట్టి ఏశావు చంపుతాడేమోనన్న భయముతో మామ యింటికి వెళ్లాడు. మామ యింటికి వెళ్ళడానికి మార్గం తెలియక అందరిని విచారిస్తూ వెళ్ళుచుండగా యొక బావి దగ్గర గొఱ్ఱెల కాపరులను తన మామ యొక్క క్షేమసమాచారము అడుగగా వారు తన మామ కుమార్తెయైన రాహేలు గొఱ్ఱెల వెంట వచ్చుచున్నదని చెప్పిరి. ఆ సమయములో రాహేలు గొఱ్ఱెలు కాచుకొంటూ ఆ బావి దగ్గర మందకు నీళ్ళు పెట్టుటకు వచ్చెను. యాకోబు రాతిని పొర్లించి ఆ గొఱ్ఱెలకు నీళ్ళు పెట్టి రాహేలును ముద్దు పెట్టుకొని యెలుగెత్తి యేడ్చెను. ఎప్పుడైతే ముద్దు పెట్టాడో రాహేలును ప్రేమించే మనస్సు కలిగింది. ప్రేమించే మనస్సు కలిగినప్పుడు ఎలాగైనా పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. పెళ్ళి చేసుకోవడం కోసం పదునాలుగు సంవత్సరాలు లాబాను యింటిలో కొలువు చేశాడు. ఆరు సంవత్సరాలు మందలకోసం కొలువు చేశాడు. ఏముంది ఒక్క ముద్దేగా, మామ కుమార్తెయేగా అనుకొన్న ఆ ఒక్క విషయం యాకోబు జీవితాన్ని ఇరవై సంవత్సరాలు వెనుకకు వెళ్ళేటట్లు చేసింది. పరాయి స్త్రీని ముట్టుకోకూడదు అన్న గ్రహింపు యాకోబుకు లేదు.

యాకోబు చాలా భక్తి కలిగిన కుటుంబంలో పుట్టాడు. తన తండ్రియైన ఇస్సాకు నలభై సంవత్సరాల వరకు వివాహం చేసుకోలేదు. నలభై సం॥ల వరకు ఏ స్త్రీని ముట్టుకొన్న వ్యక్తి కాదు. రిబ్కాను వివాహం చేసుకున్నప్పుడు ఇస్సాకు వయస్సు నలభై సం॥లు. యాకోబు ఒక్కసారి స్త్రీని ముట్టుకొన్నందుకు పగలు ఎండకు రాత్రి మంచుకు క్షీణించిపోయాడు. **"ఈ యిరువది యేండ్లు నేను నీయొద్దనుంటిని. నీ గొఱ్ఱెలైనను మేకలైనను ఈచుకొని పోలేదు, నీ మంద పొట్టేళ్లను నేను తినలేదు. దుష్ట మృగములచేత చీల్చబడినదానిని నీ యొద్దకు తేక ఆ నష్టము నేనే పెట్టుకొంటిని పగటియందు దొంగిలింపబడిన దాని నేమి రాత్రి యందు దొంగిలింపబడినదాని నేమి నాయొద్ద పుచ్చుకొంటివి; నేను**

**ఈలాగుంటిని పగటి యెండకును రాత్రి మంచుకును నేను క్షీణించిపోతిని; నిద్ర నా కన్నులకు దూరమాయెను"** ఆది.31:38-40. జీవితములో ఒక్క క్షణం దేవుని భయమును పోగొట్టుకొని ప్రక్క మార్గంలోకి వచ్చిన యాకోబు ఇరవై సంవత్సరాలు నిద్రపోలేదు. యాకోబు పదునాలుగు సంవత్సరాలు రాహేలు కోసం కొలువు చేసి అన్ని ఏండ్లు ఎదురుచూసిన మరలా ఎప్పుడు రాహేలును ముద్దుపెట్టుకొన్నట్లుగా మనకు కనబడదు. పదునాలుగేండ్లు ఎంతో దూరంగా ఉన్నాడు. తన మామ రాహేలును ఇచ్చు వరకు వేచియున్నాడు. క్రమమైనవాడే, పద్ధతి కలిగినవాడే, పదునాలుగు ఏండ్లు మామ యింటనే ఉన్నను రాహేలును ఎందుకు పట్టుకోలేదు? అది పద్ధతి కాదు మామ ఇచ్చేవరకు వేచి ఉండాలి అనే విషయం యాకోబుకు తెలుసు. రాహేలు కొరకు ఏడు సంవత్సరములు కొలువు చేసెను కాని మామ మోసం చేసి మొదట లేయాను ఇచ్చి చేసెను. మరలా రాహేలును ఇచ్చి చేసేవరకు ఏడు సంవత్సరములు కొలువుచేసి వేచియున్నాడు. నీవు జీవితములో ఒకసారి దేవుని భయాన్ని విడిచి మిగిలిన జీవితమంతా భయముతో నడువవచ్చు కాని భయము పోగొట్టుకొని ప్రవర్తించిన ప్రవర్తన మిగిలిన జీవితమంతా ఎంతో నష్టాన్ని సమకూరుస్తుంది. యాకోబు రాహేలును ముద్దుపెట్టుకొనకపోయినట్లయితే తన జీవితం ఎంతో దీవెనకరముగా యుండి ఉండేది. నీ జీవితంలో దేవుని భయాన్ని విడిచిన క్షణం అది నీకు ఎంతో నష్టం. అందుకే నిత్యము భయము కలిగి నడచుకొనవలెనని దేవుని వాక్యం సెలవిస్తుంది. ఒకరోజు కాదు రెండు రోజులు కాదు నీవు నిత్యము భయము కలిగి నడుచుకోవాలి. వాక్యము నిత్యము మనతో మాట్లాడుతుంది. నీవు ఎప్పుడైతే భయం లేకుండా ఉంటావో అప్పుడు సత్యంలో నుండి తప్పిపోతావు. సత్యములోనుండి తప్పిపోవడం నీకు చాలా తేలిక కాని దానిని కాపాడుకొని నిలబడడం ఎంతో క్షేమం. ముద్దుపెట్టుకోవడం తప్పు కాదని అనుకొనవచ్చు కాని తన జీవితం క్షీణించినప్పుడు అది తప్పని యాకోబుకు అర్థమైనది. ఈ దినములలో మనము కూడ ఇటువంటి విషయాల్లో దేవుని భయం నుండి తప్పిపోవుచున్నాము.

బైబిల్లో నాబాలు అను ఒక వ్యక్తి ఉన్నాడు **"అతని పేరు నాబాలు అతని భార్య పేరు అబీగయీలు. ఈ స్త్రీ సుబుద్ధిగలదై రూపసియైయుండెను అయితే చర్యలనుబట్టి చూడగా నాబాలు మోటువాడును దుర్మార్గుడునై యుండెను. అతడు కాలేబు సంతతివాడు. నాబాలు గొఱ్ఱెలబొచ్చు కత్తెర వేయించుచున్నాడని అరణ్యమందున్న దావీదు విని తన పనివారిలో పదిమందిని పిలిచి వారితో ఇట్లనెను మీరు కర్మెలునకు నాబాలునొద్దకు పోయి..."** 1సమూయేలు 25:3-5. ఆ యింటిలో దేవుని భయము కలిగిన నాబాలు భార్యయైన అబీగయీలు ఉంది కాని నాబాలు మోటువాడు, దుర్మార్గుడు. ఈ నాబాలు యొక్క గొర్రెల కాపరులకు దావీదు పనివారు ఎంతో సహాయం చేసిరి. తదుపరి కాలములో నాబాలు వలన సహాయం పొందుటకు దావీదు తన పనివారిని పంపగా నాబాలు వారితో **"దావీదు ఎవడు? యెష్షయి కుమారుడెవడు?తమ యజమానులను విడిచి పారిపోయిన దాసులు ఇప్పుడు అనేకులున్నారు"** అని కఠినముగా మాటలాడెను 1సమూయేలు 25:10. అతడు వారితో కఠినముగా మాట్లాడిన ఆ మాటలు నాబాలు ప్రాణానికే ముప్పు తెచ్చినవి. నీవు మాట్లాడే మాటలలో దైవత్వము ఉన్నదా! అయ్యో ఇప్పుడు అవకాశం లేదు అని నాబాలు వినయముగా జవాబిచ్చి యున్నట్లయితే నాబాలు క్షేమంగా ఉండేవాడు గాని దావీదు ఎవడు? యెష్షయి కుమారుడెవడు? అని పలికిన ఆ కఠినమైన మాటలు నాబాలు యొక్క కుటుంబంలో మరణాన్ని తెచ్చినవి.

కొన్నిసార్లు పొరబాటున నోరు జారినది అంటాము. నోటిమాటలు దేవుని భయంతో రాక మన పదవిని బట్టో స్థానాన్ని బట్టో లేకపోతే అనాలోచితంగానో ఆ ఏముంది వాళ్ళు ఏమి చేస్తారులే అదేముందిలే అనుకొని మాటలాడితే తిరిగి ఎన్నడు వాటిని వెనుకకు తీసికొనలేము. నీ నోటనుండి వచ్చే మాటలలో దైవభయము ఉన్నదా? దేవుని భయాన్ని ప్రక్కనపెట్టి వస్తున్నాయా? నాబాలు ఊహించనిది తన జీవితములో జరిగిపోయినది. దావీదు నాలుగు వందల మందితో వస్తున్నాడు అని తెలిసిన నాబాలు రాయివలె బిగిసికొనిపోయాడు. ఎంత చిన్న పొరపాటు ఎంత గొప్ప నష్టానికి దారి

తీసింది? ఈ దినం వాక్యం చదువుచున్న నీవు ఎటువంటి తీర్పును పొందబోవుచున్నావు? అది ఏముందిలే అని నీవు అనుకొంటావు కాని నీ నోట నుండి వచ్చే కఠినమైన మాటలు ఎదుటివారిని ఎంత బాధపెట్టుచున్నవో నీవు గుర్తించలేవు. నీ ప్రవర్తన ఇప్పుడు నీకు తెలియదు. దేవుని భయాన్ని విడిచి ఇప్పుడు నీవు వేస్తున్న అడుగులు రేపు ఒకరోజు నిన్ను తలపట్టుకొనేటట్లు చేస్తాయి.

యోబు యథార్థవంతుడును న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి యున్నాడు. భూమిమీద అతనివంటివాడెవడును లేడు. ఒకానొక దినమున ఆస్తిని బిడ్డలను తనకు కలిగిన యావత్తును కోల్పోయెను. చివరకు తన శరీరమంతయు కురుపులు వచ్చి పెంకులతో గోకుకొనవలసి వచ్చెను. ఆ పరిస్థితులలో తన భార్య నీవు ఇంకను యథార్థతను వదలకయుందువా! దేవుని దూషించి మరణము కమ్మనెను. యోబు ఆమెతో దేవుని వలన మనము మేలు అనుభవించుదుమా కీడును మనము అనుభవింప తగదా! మూర్ఖురాలు మాటలాడినట్లు మాటలాడకుము అనెను. నీకు దేవుని భయము ఉన్నప్పుడు నీ జీవితం శూన్యముగా కనబడినను అక్కడ కూడా నీలో దైవత్వం కనబడుతుంది. నీ జీవితంలో దేవుని కార్యాలు కనబడనప్పుడు కూడా నీవు నిబ్బరంగా ఉంటావు. యోబు సర్వ శరీరం కృశించినను నా విమోచకుడు సజీవుడు నేను ఆయనను కన్నులారా చూచెదను అని చెప్పి దేవుని భయమును కాపాడుకొన్నాడు. దేవుని భయము నీలో ఉన్నప్పుడు పరిస్థితులు నీకు అనుకూలముగా లేకపోయినను, ఆరోగ్యము క్షీణించినను నీతో ఉన్నవారు ఎవరును నీకు సహకరించకపోయినను, నీ కుటుంబమే నిన్ను వెలివేసినను వాటన్నింటిలో నీవు దేవుని యొక్క భయమును కాపాడుకొని బ్రతుకుతావు.

నాబాలు దావీదు పనివాళ్ళతో చెప్పాడు గాని పనివాళ్ళు దావీదుతో చెప్పితే దావీదు ఏమి నిర్ణయం చేస్తాడో నాబాలుకు అవగాహన లేదు. నీవు దేవుని భయము లేకుండా మాట్లాడినప్పుడు దాని నుండి వచ్చే పరిణామాలు

నీ జీవితాన్ని చిందరవందర చేస్తాయి. అబీగయీలు దావీదును కలుసుకోవడానికి వెళ్ళింది అయ్యా! నీ దాసురాలి పాపమును క్షమించుమని అడిగింది. అబీగయీలు జరిగిన సంగతి నాబాలునకు తెలియజేయగా భయము చేత అతని గుండె పగిలెను. ఇటువంటి పరిస్థితి వస్తుందని నాబాలు ఊహించలేదు. దావీదు ఎవడు యెష్షయి కుమారుడెవడు అంటే దావీదు అలాగా స్పందిస్తాడని అలా కఠినముగా వ్యవహరిస్తాడనే విషయం నాబాలుకు తెలియదు. నీ జీవితంలో కూడా నీ మాటలు దేవుని భయము లేకుండా ఉంటే అవి నీ ప్రాణానికి ఎంతో ప్రమాదం. నీవు మాట్లాడినప్పుడు ఆ వ్యక్తి లేకపోవచ్చు కాని ఆకాశపక్షులు సమాచారమును తీసికొనిపోతాయి. నేను ఏమైనా గాని ఎంత మాత్రము దేవుని దూషించను అని పలికిన యోబువలె మనము ఈ దినమున దేవుని భయముతో ఉన్నామా!

దావీదు సౌలు చేత తరుమబడ్డాడు అయినను దేవుడు అభిషేకించినవాని జోలికి నేను వెళ్ళను అని దేవుని భయము కలిగి సౌలును చంపుటకు మనస్సు లేనివాడాయెను. సౌలు కంటే, ఫిలిష్తీయుల కంటే దావీదు బలాఢ్యుడు. దావీదు సౌలు చేత తరుమబడ్డాడు గాని సౌలును తరమలేదు. పారిపోయాడు గాని సౌలును పారిపోయేటట్లు చేయలేదు. నీవు పారిపోయినట్లుగా కనబడతావు గాని దేవుని భయము ఉంటే ప్రభువు నామములో విజయము నీదే . నీవు మౌనముగా ఉన్నట్లు కనబడతావు గాని దేవుని భయము ఉంటే విజయము నీదే. అందుకే పౌలు అంటాడు మేము తరుమబడుచున్నను యుద్ధము రానివారము కాము. కొన్ని పరిస్థితులు ప్రభువు నీ జీవితంలో అనుమతింప చేస్తారు. అప్పుడు నీ జీవితంలో ఆయనకు ఏమి కనబడాలి అంటే దేవుని భయము? యోబు సంతోషించడానికి ఏముంది? పిల్లలు, ఆస్తి పనివాళ్ళు ఎవరు లేరు వ్యాధితో చిల్లపెంకులు పెట్టి గీక్కొంటున్నాడు. ఆదరించే స్నేహితులు దగ్గరకు రాకుండ దూరాన నిలిచి మాట్లాడుచున్నారు. అటువంటి పరిస్థితులలో కూడా యోబు నోటి మాటలలో కూడా పాపం చేయలేదు.

అబ్రాహాము శారాలకు పిల్లలు పుట్టలేదు. వాస్తవంగా పిల్లలు పుట్టకుండ ఉండడానికి లోపం శారాలోనే ఉంది. అబ్రాహాము హాగరును చేసుకుంటే పిల్లలు పుట్టారు. అబ్రాహాము లోపం నీలోనే ఉంది అని శారాను ఎన్నడు అనలేదు. అదే దేవుని భయము అంటే. వాగ్దానము చేసిన దేవుడు నమ్మదగినవాడు గనుక ఆయనే బిడ్డలను ఇవ్వగలడని దేవుని భయముతో మౌనంగా ఉన్నాడు. నీలోనే లోపం ఉంది అని చెప్పడం వలన శారా తన లోపాన్ని శరీరంలో నుండి తీసివేసికొనగలదా ఇటువంటి మాటలు కుటుంబంలో చాలా దూరాన్ని పెంచుతాయి. ఆ మాటలు స్తంభాలులాగా అలా నిలబడిపోతాయి. అక్కడ దేవుని ఆత్మ పని చేయదు. ప్రభువుకు మహిమరాదు మనము కొంచెం వేచి ఉండాలి. దేవుడు ఏదైన చేయగలడు గనుక అబ్రాహాము ఎదురు చూచిన ఒకరోజు వచ్చింది. స్త్రీ ధర్మం అయిపోయిన తరువాత దేవుడు శారా గర్భమును తెరిచాడు. వృద్ధాప్యమందు గర్భము ధరించిన స్త్రీగా చరిత్రకు ఎక్కింది. దేవుని భయము ఉన్నప్పుడు నీవు నడిచేటువంటి నడక నీవు ఆలోచించే విధానం అది వేరుగా ఉంటుంది. దేవుడు నీకిచ్చే ఆశీర్వాదం కూడా శాశ్వతంగా ఉంటుంది.

ఈ దినము మనలను మనము పరీక్షించుకొందాం! దేవునికి భయపడక తొందరపడి రాహేలును మద్దుపెట్టుకొని 20సం॥లు యాకోబు క్షీణించిపోయినట్లు మనము క్షీణించిపోకూడదు. భయములేని మాటలు మాట్లాడి నాబాలు మరణాన్ని పొందాడు. భయము కలిగిన అబ్రాహాము నోటి మాటను జాగ్రత్తగా కాపాడుకొని వాగ్దానమును స్వతంత్రించుకొన్నాడు. నోటిమాటయందు కూడా పాపం చేయకుండా యోబు దేవుని ఎదుట యథార్థవంతునిగా బ్రతికాడు. దేవుని భయము కలిగిన దావీదుకు శాశ్వతమైన కృప దొరికింది. దావీదుకు నా కృప నేను దూరం చేయను అని చెప్పాడు. నిత్యము భయము కలిగి ప్రవర్తించువాడు ధన్యుడు నిన్ను ధన్యునిగా చేయాలనే ప్రణాళిక కలిగి ప్రభువు నిన్ను ఆకర్షించారు. ఆయన నీ విషయం మరచిపోయేవాడు కాదు. ఆయన భయము నిన్ను ప్రగతిపథములో నడిపిస్తుంది.

***- ఎడిటర్***

## “యెడతెగక ప్రార్థన చేయుడి” 1థెస్స.5:15.

అనారోగ్యముగాను బలహీనముగానున్న ఒక దైవసేవకుడు ఒక ఉదయకాలమున రోడ్డు ప్రక్కన నడుచుచూ వెళ్ళుచుండగా ఆ రోడ్డుప్రక్క వృద్ధాప్యములో ఉన్న ఒక వ్యక్తి వెూకాళ్ళ విూద ఉండి రాళ్ళు పగులగొట్టుచుండెను. ఆ రాళ్ళు రోడ్డు బాగుచేయుటకు ఉద్దేశించబడినవి. ఆ దైవసేవకుడు ఆ వృద్ధుని పలుకరించి నాయనా నీ వయస్సు ఎంత అని అడిగెను. దేవుడు నాకు వచ్చే బుధవారం వరకు ఆయువును ఇచ్చిన యెడల నాకు డెబ్బది రెండు సంవత్సరములు నిండునని ఆ వృద్ధుడు చెప్పెను. ఆ దైవసేవకుడు నీకు అంత వయస్సు ఉండునని అనుకొన్నాను అయినా ఈ వయస్సులో నీవింత కష్టపడుట నాకు విచారముగానున్నది. నీకు అలసట వచ్చుట లేదా అని ఆ బోధకుడు అడిగెను. ఇది కష్టమైన పనియే నిలువబడి ఈ పనిచేయాలంటే వీపు విరిగే పని గాని మోకాళ్ళమీద ఉండి ఈ పని చేయుటవలన కొంత సుళువుగా నున్నది అని ఆ వృద్ధుడు పలికెను. ఆ దైవసేవకుడు నీ పని కష్టమైనదే గాని నా పని ఇంకా కష్టమైనదని పలికెను. ఆ వృద్ధుడు నీ పని కష్టమైనదా అంటూ నిన్ను చూస్తే కష్టించి పనిచేయువానివలె లేవు అయితే నీ యెడల నాకు అసూయ లేదు. నేను కష్టించి పనిచేయుదును నా పని అంటే నాకు సంతోషమే. నీవు చాలా కృశించియున్నావు విచారముగా కన్పించుచున్నావు ఎందుచే అలా ఉన్నావు నీ వృత్తి ఏమిటి అని ఆ వృద్ధుడు దైవసేవకుని అడిగెను.

అప్పుడా బోధకుడు “ఆత్మలు రక్షించుట అను భారమైన పనితో నేను కృంగిపోవుచున్నాను. నీవు సులభముగా రాళ్ళను పగులగొట్టునట్లు రక్షింపబడని మానవుల కఠిన హృదయములను నేను పగులగొట్టగలిగిన యెడల నేనెంతో సంతోషింతును” అని జవాబిచ్చెను. ఆ వృద్ధుడు మీరు నిలువబడి ఎక్కువ పని చేయుచున్నారేమోనండి, అని మోకాళ్ళ మీద ఉండి ఆ పని చేయండి అప్పుడు మీ పని సులభము కావచ్చును అని పలికెను. అంటే మీ ఉద్దేశము ఏమిటి అని విసుగుచెందిన ఆ సేవకుడు ప్రశ్నించెను.

ఆ వృద్ధుడు బోధకుని వైపు చూచి నీవు మోకరించి దేవుని సహాయము కోరినయెడల ఆ కఠిన హృదయములను నీవు సులభముగా పగులగొట్టగలవు. నీ పని చక్కగాను సులువుగాను చేయగలవు అని సలహా ఇచ్చెను. ఆ వృద్ధుని మాటలు ఆ దైవసేవకుడు తన హృదయమందు భద్రపరచుకొని మోకాళ్ళమీద పడి ఒక్కొక్క ఆత్మను దేవుని వైపు ఎత్తిపట్టుకొని ఆ కఠిన హృదయములను పగులగొట్టుమని సర్వశక్తి గల దేవునికి మొరపెట్టెను. అప్పుడు ఆ దైవసేవకుడు ఆత్మలను సంపాదించు పని సులభముగా చేయగలిగెను. సేవలో గొప్ప ఫలములను చూచెను.

ప్రియులారా! యెడతెగని మోకాళ్ళ ప్రార్థనలో ఎంతో శక్తి ఉంటుంది. ఆ వృద్ధుడు మోకాళ్ళ మీద ఉండి రాళ్ళను పగులగొట్టినట్లుగా ప్రతి ఆత్మ విషయమై మోకాళ్ళ మీద ఉండి మొరపెట్టుటకు గొప్ప ఫలములు పరిచర్యలో చూచుటకు పరిశుద్ధాత్మ దేవుడు ప్రతి ఒక్కరికి సహాయం చేయును గాక!

**దేవుడు మన చెయ్యి విడిచిపెట్టేస్తాడేమో అనిపించే పరిస్థితుల్లో కూడా నమ్మకం ఉంచడం, మన ఆక్రందనల్ని ఎవరూ వినడం లేదేమో అనిపించినా, మన అరుపులకి కనీసం ప్రతిధ్వని కూడా వినిపించనంత శూన్యం ఆవరించినా విజ్ఞాపనలు చెయ్యడం, ఈ లోకం ఓ యంత్రంలాగా దాని పని అది చేసుకుంటూ పోతూ కలకాలం ఎవరితో నిమిత్తం లేకుండా కొనసాగుతూ ఉన్నప్పుడు కూడా దేవుడు నిద్రపోవడం లేదు, ఎప్పటిలాగానే మనల్ని ప్రేమిస్తూ ఉన్నాడు అన్న నిశ్చయతని కలిగి ఉండడం, ఇది కావాలి అని కోరుకోకుండా మనకు ఏది దక్కితే అది దేవుడు మనకిచ్చిందని అనుకోవడం, ఓపికతో ఎదురుచూడడం, విశ్వాసం ఎండిపోతుందేమోనన్న భయం తప్ప ఇక చావుకైనా భయపడకపోవడం ఇదే లోకాన్ని జయించే విశ్వాసం అంటే.**

**యేసు దేవుని కుమారుడని నమ్మువాడు తప్ప లోకమును జయించువాడు మరి ఎవడు?**

# నిర్ణయం

**"దేవుడు నోవహుతో సమస్త శరీరుల మూలముగా భూమి బలాత్కారముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చియున్నది; ఇదిగో వారిని భూమితోకూడ నాశనము చేయుదును".** ఆది 6:13

దేవుడు నోవహుతో ఓడ కట్టమని చెప్పాడు. అయితే ఓడ ఏవిధంగా ఉంటుందో దాని నమూనా ఏమిటో దేవునికి తప్ప నోవహుకు తెలియదు. ఓడను గూర్చిన అనుభవం కూడ ఎవరికి లేదు. ఇప్పుడు ఒక క్రొత్త సవాలు నోవహుకు ఇవ్వబడినది. ఓడ కట్టాలి మరి దానికి సంబంధించిన సామాగ్రి వాటి కొలతలు సైజులు ఎలా చెక్కాలి? నమూనా ఏమిటి? అనుభవజ్ఞులు ఎవరును తనతో లేరు. తాను చేసే పనిలో పొరబాటులు దిద్దేవారు కూడ లేరు. మన భక్తి జీవితంలో కూడా చాలా విశ్వాసంతో కూడిన సవాళ్లు వస్తాయి. ఏ నమూనా మనకు ఉండదు ప్రభువే మన నమూనా మనమే వాటిని జయించాలి. నీ విశ్వాస జీవితములో నీకెదురయ్యేటువంటి సవాళ్ళను నీవు ఎదుర్కోవాలి. కొన్నిసార్లు నీ భర్తకు చేతిలో డబ్బులు ఉండవు. చర్చికి రావడానికి చార్జీలకు కూడా డబ్బులు ఉండవు. కానుక ఇవ్వాలని ఉంటుంది ఇవ్వలేవు. దేవుని కొరకు ఎంతో త్యాగం చేయాలని ఉంటుంది కాని కుదరదు. నీవు దేవుని మార్గములో నడవడానికి నీకు అవసరమైనది ఒక్కటే అదే నీ నిర్ణయం. నీ నిర్ణయాలే నీకు రాజ మార్గాలను ఏర్పాటు చేస్తాయి. నీవు నిర్ణయం చేసిన తరువాత ప్రభువు ఆత్మ అక్కడ పని చేయకుండ ఉండదు.

దేవుడు నోవహుతో చెప్పాడు దానిని చేయాలనే ఆశ నోవహుకు ఉంది దానిని కట్టడానికి ప్రభువే అంతా సమకూర్చారు. ఎప్పుడైతే దేవునికి లోబడాలి పనిచేయాలి అనుకుంటావో నీకు కావలసిన సమస్తమును ఆయనే సమకూర్చుతారు. ఓడ కొరకు సమస్తము సిద్ధపరచబడినవి. ఓడ సగభాగం కట్టబడిన తరువాత వర్షం గాని తుపాను గాని వస్తే పరిస్థితి ఏమిటి? వీటిని తయారు చేసికోవడం ఒక పనియైతే ఓడ ప్రారంభం నుండి ముగింపు వరకు

తుపాను మరియు పరిస్థితులు అనుకూలంగా ఉండడం అనేది ఇంకా గొప్ప సంగతి. నీ నిర్ణయం పరిస్థితులను తలక్రిందులుగా చేస్తుంది. జలప్రళయంలో అన్నీ మునిగిపోయినవి గాని నోవహు ఓడ మునగలేదు. నూటయాభై దినములు భయంకరమైన తుపాను వస్తే అంతకంతకు ఆ ఓడ పైకి వెళ్ళిపోయింది. మన జీవితంలో కూడా ప్రభువు మనలను నడిపించేటప్పుడు ప్రభువు మన ముందుంచే పని మన పిలుపుకు, మన విశ్వాస జీవితానికి మన గురికి చాలా కష్టంగా కనబడతాయి. మన నిర్ణయం స్థిరంగా ఉన్నప్పుడు వాటన్నింటిని చేయుటకు చాలిన కృప ప్రభువు మనకిచ్చి నడిపిస్తారు. ఓడను ఎలా కట్టాడు అని చూస్తే అది మనకు అర్థం కాదు. నీ జీవితంలో పరిస్థితులు ఎప్పుడు గొల్యాతులాగానే కనబడతాయి కాని చిన్నవిగా కనబడనే కనబడవు, నీ వయస్సుకంటే అవి పెద్దవిగా కనబడతాయి.

నోవహు ఓడ కట్టుటకు భార్య ఒప్పుకోవాలి, కలప కావాలి, అందరు కట్టడం లేదు మనమెందుకు కట్టాలి అని పిల్లలు అనవచ్చు. దేవుడు ఎవరికి చెప్పకుండా నీకు ఒక్కడికే చెప్పాడా అనేవారు కూడ ఉండవచ్చు. ఇవన్నియు తన ముందు సమస్యలుగా కనబడుచున్నను దేవునితో మనస్సు కలిపి నిర్ణయంలో నిలబడినాడు. అంతేకాక తనతో కలిసి పనిచేసేవారు కావాలి, వాతావరణం అనుకూలంగా ఉండాలి, అన్ని పరిస్థితుల మధ్య ఏకాగ్రతను నిలిపి ఓడను కట్టాలి. తాను చేసేది దేవుని చిత్తమే అని మరెవరి దగ్గర కూడ నిశ్చయం చేసికొనుటకు అవకాశం లేదు, చేయూత నిచ్చేవారు కూడా నోవహుకు ఎవరు లేరు. ఎన్నో అననుకూల పరిస్థితులు తన ఎదుట కనబడుచున్నను వాటి మధ్య దేవుని కొరకు నిలబడి నోవహు పని చేశాడు. నీ జీవితంలో కూడా నీవు పోరాడవలసిన పోరాటంలో ఎప్పుడు వెనుతిరిగి చూడకూడదు. నోవహు దేవుని పని చేసే మనస్సు కలిగినవాడు కాబట్టి అతని గూర్చి దేవుడు ఓడ కట్టక మునుపే **"యెహోవా ఈతరమువారిలో నీవే నా యెదుట నీతిమంతుడవై యుండుట చూచితిని గనుక నీవును నీ యింటివారును ఓడలో ప్రవేశించుడి"** ఆది 7:1 అని సాక్ష్యమిచ్చెను.

దేవుడు కొలతలన్ని ఇచ్చిన తరువాత ఇవి ఎందుకు? ఎవరికి? ఈ కొలతలతోనే కట్టుటకు కారణమేమి? అని నోవహు దేవుని ప్రశ్నించలేదు. మన మనసంతా దేవుడు చెప్పినది ఏవిధంగా చేయకుండ తప్పించుకోవాలా అనే దాని మీదనే ఉంటుంది గనుకనే సమస్యలు వెదకి దేవుని చిత్తం నుండి తప్పిపోవుచున్నాము. దేవుడు మనకు అవకాశం ఇవ్వడమే గొప్ప విషయం. ఓడ కట్టే అవకాశం నోవహుకు ఇవ్వడమే గొప్ప విషయం. దేవుడు కొలతలన్ని ఇచ్చి దానిని కట్టుటకు నోవహు మనస్సు నిలిపిన తరువాతనే నీవే ఈ తరములో నా యెదుట నీతిమంతుడవు, "ఇదిగో నేనే జీవవాయువు గల సమస్త శరీరులను ఆకాశము క్రింద నుండకుండ నాశనము చేయుటకు భూమిమీదకి జలప్రవాహము రప్పించుచున్నాను. లోకమందున్న సమస్తమును చనిపోవును. అయితే నీతో నా నిబంధన స్థిరపరచుదును నీవును నీతోకూడ నీ కుమారులును నీ భార్యయు నీ కోడండ్రును ఆ ఓడలో ప్రవేశింపవలెను. మరియు నీతో కూడ వాటిని బ్రదికించి యుంచుకొనుటకు సమస్త జీవులలో అనగా సమస్త శరీరులయొక్క ప్రతిజాతిలోనివి రెండేసి చొప్పున నీవు ఓడలోనికి తేవలెను". దేవుడు చెప్పినది చేయుటకు మన మనస్సు ఆయత్తపరచబడిన తరువాతనే దేవుని అంతరంగములో ఉన్నది మనకు బయలుపరచబడుతుంది.

దేవుడు నోవహుతో ఒకసారే మాట్లాడి అతడు చేయవలసిన దానిని తెలియజేసెను. ప్రభువు నీతో చెప్పినది చేసే మనస్సు నీకు ఉన్నప్పుడు పలుమార్లు ఆయన నీతో మాట్లాడవలసిన అవసరం ఉండదు. **"దేవుడు ఒక్కమారే పలుకును రెండు మారులు పలుకును అయితే మనుష్యులు అది కనిపెట్టరు" యోబు 33:14.** దేవుని కొరకు మనము సరైన నిర్ణయం చేసినప్పుడు మన సమస్యలన్ని పటాపంచలైపోవును. నోవహు నిర్ణయం చేసినప్పుడు ఓడ చేసి ముగించేవరకు వర్షం పడలేదు. దేవుడు పని చేయడానికి బడ్జెట్ ఎప్పుడు ఇవ్వడు. విశ్వాసమే మన బడ్జెట్. మనం విశ్వాసంతో ఉంటే ప్రభువు చేస్తారు. దేవుడు నీ జీవితములో ఆయన పని చేయుటకు నీకు అవకాశం ఇవ్వడమే నీ భాగ్యం. ఎప్పుడైతే ఆ పనిని భాగ్యముగా ఎంచుకొని మనస్సు నిలిపి గురి కలిగి ప్రయాణం చేస్తావో అత్యధిక విజయం పొందుకొనగలవు.

నోవహు ఓడ నిర్మాణం కొరకు నిర్ణయం చేసిన తరువాత ఆర్థిక సమస్య పోయింది, మనుష్యుల సమస్య పోయింది, వాతావరణ సమస్య పోయింది అన్ని తీరిపోయినవి ప్రభువు అద్భుతంగా కట్టాడు. చితిసారకపు ప్రానుకు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే ఆ ప్రాను వందల సం॥లు నీటిలో ఉన్నా కూడా కుళ్ళిపోదు. జంతువులు ఓడలో ఎలా ఉన్నాయి? మూడు రోజులు పశువుల దగ్గర బాగుచేయకపోతే ఎంత వాసన వస్తుంది? ఇన్ని రోజులు నోవహు ఓడ కంపుకొట్టలేదు ఎందుకని? దేవుడే పరిమళ వాసనగా మార్చేసి ఉంటాడు. ప్రతి సమస్య దేవుడు తీసివేశారు. నీవు దేవుని కొరకు పని చేయాలి అనే **నీ నిర్ణయం** దేవుని స్వరం వినాలనే **నీ నిర్ణయం** నీ సమస్యలన్నిటిని తీసివేస్తుంది. నీకు నిర్ణయం ఉంటే ప్రభువు కృపనిస్తారు. నీవు నిర్ణయం చేయకపోతే ప్రభువు సమస్యను ఏలాగు తొలగిస్తారు? ఆయన కృప నీకు ఏలాగు దొరుకుతుంది?

నోవహు యెదుట ఉన్న సమస్యలేవి తనకు సమస్యగా లేవు. ఇన్ని సమస్యలు ఎదుర్కోవడానికి ఎంతమంది విశ్వాసవీరులున్నారు? నోవహు భార్య పేరు వ్రాయబడలేదు గాని ఆమె అతనితో నడిచింది. నీకు ఎన్నడు బలహీనమైన మనస్సాక్షి ఉండకూడదు. రూతుకు ఎన్ని సమస్యలు ఉన్నాయి. భర్త చనిపోయాడు, ఒంటరిగా ఉంది. వివాహం జరుగుతుందన్న నిశ్చయత లేదు. వాటన్నిటి మధ్య నీ దేవునినే నేను సేవిస్తాను అని నిర్ణయం చేసినది. నీవు సమస్య గురించి మాట్లాడుచున్నప్పుడు అన్నీ సమస్యలే. నయోమి రూతుకు ఏమైన సహాయం చేయగలిగిందా? బేత్లెహేముకు వెళ్ళడానికి దారి మాత్రమే చూపించింది. నీకు ఎవరైన దారి చూపిస్తారు గాని నీ బరువు ఎవరు ఎత్తుకొనరు నీవు మోయవలసినదే. రూతు యొక్క బరువు బాధ్యతలు ఏమియు నయోమి చూడలేదు.

**"అందుకు రూతు నా వెంబడి రావద్దనియు నన్ను విడిచిపెట్టుమనియు నన్ను బ్రతిమాలుకొనవద్దు నీవు వెళ్లుచోటికే నేను వచ్చెదను, నీవు నివసించుచోటనే నేను నివసించెదను, నీ జనమే నా జనము నీ దేవుడే నా దేవుడు; నీవు మృతి బొందుచోటను నేను మృతిబొందెదను"** రూతు 1:16. నయోమి, రూతు, ఓర్పా ముగ్గురును బేత్లెహేమునకు ప్రయాణమైరి. బేత్లెహేముకు (గమ్యం)

చేరింది ఇద్దరు మాత్రమే. ఓర్పా కూడా ప్రయాణం చేసింది గాని మార్గమధ్యలో ఆమె నిర్ణయం బద్దలైపోయి అత్తను ముద్దుపెట్టుకొని వెనుతిరిగింది. నిర్ణయం ఉన్నవారు ప్రయాణం చేయగలరు సమస్య గురించి మాట్లాడరు, సమస్యలలోనే ఆగిపోరు. ప్రభువు చిత్తం నీవు నేను సంపూర్ణంగా చేయాలి అంటే ఆయన చెప్పింది చేయాలనే నిర్ణయం బలంగా ఉండాలి. ఆలోచన ఉండడం వేరు నిర్ణయం చేయడం వేరు. ఓర్పాకు ఆలోచన ఉంది కాబట్టే బేత్లెహేముకు ప్రయాణం అయింది నయోమి మాట విని మధ్యలోనే వెనుతిరిగింది. ఈ దినము మీరు ప్రయాణం చేసినవారా! బేత్లెహేము వచ్చు వరకు ప్రయాణం చేయాలా? కొంతకాలం ప్రయాణమా? లేక గమ్యం చేరువరకు ప్రయాణం చేసేవారా? ఓర్పా వెనుదిరిగి వెళ్ళిపోయినా రూతు వెనుదిరిగి చూడలేదు. రూతు ప్రయాణం చేసినప్పుడు ఓర్పా ఎందుకు ప్రయాణం చేయలేదు. ఓర్పాకు అటువంటి నిర్ణయం లేదు అందుకే ఆమె ప్రయాణం చేయలేకపోయింది. నీ భక్తి జీవితంలో నీకు కావలసినది డబ్బు బలం కాదు దేవుని కొరకు ప్రయాణం చేయాలనే నీ నిర్ణయం నీ సమస్యలన్నింటిని తొలగిస్తుంది.

యోబుకు వ్యాధి ఉంది అయితే నా విమోచకుడు సజీవుడు నేను కన్నులారా ఆయనను చూస్తానంటున్నాడు. యోబుకు వచ్చిన వ్యాధిలో స్నేహితులు దూరం నుండి చూస్తున్నారు కాని పలుకరించలేకపోయారు, బూడిదలో కూర్చుని చిల్లపెంకుతో గీక్కొంటున్నాడు. ఈ పరిస్థితుల్లో నా విమోచకుడు సజీవుడు నేను కన్నులారా ఆయనను చూస్తానని యోబు అంటున్నాడు. కాబట్టి ఆయన వ్యాధి ఆయనను ఏమి చేయలేకపోయింది. మీ అంతరంగంలో దేవుని కొరకు ఉన్న జిజ్ఞాస ఏంటి? అది అన్నింటిని తొలగిస్తుంది. నీకు నిర్ణయం ఉంటే ఆయన ఏమైనా చేసి ఎలాంటి పరిస్థితులనైనా అనుకూలపరుస్తారు.

దేవుడు బోయజుకు రూతు మీద దయను పుట్టించి, రూతును పోషించేటట్లు చేసాడు. బోయజు ఎన్నడు రూతును చూడనే చూడలేదు కాని ప్రభువే రూతు విషయమై బాధ్యత తీసికొనేటట్లు చేసారు.

దావీదు గొల్యాతును జయించవలసిన పరిస్థితులున్నప్పుడు దావీదు దగ్గర యుద్ధవస్త్రాలున్నాయా? దావీదుతోపాటు యుద్ధానికి వచ్చేవారెవరైనా ఉన్నారా? జీవముగల దేవుని సైన్యమును తిరస్కరించుటకు సున్నతిలేని ఈ ఫిలిష్తీయుడు ఏపాటివాడని పలికెను. దేవుని వాక్యం ఎప్పుడును మనతో మాట్లాడుతుంది. వాక్యంలో ఉన్నటువంటి ఆ ఆనందాన్ని మనం అనుభవించాలి. దావీదుకు ఆ సమయములో నేను ఒక్కడినే అనే విచారం కాని ఏమైనా జరుగుతుందనే ఆలోచన గాని లేదు. దావీదు పరిస్థితులవైపు చూస్తే గొల్యాతు పెద్దవాడు, తనకైతే యుద్ధవస్త్రాలు లేవు, అంతకుముందు సైన్యంలో ఎప్పుడు లేడు, అందుకని దావీదు నాకెందుకులే నేను గొర్రెలను కాచుకొంటే సరిపోతుందని అనుకొనలేదు. మన ఆలోచనా విధానం పరిస్థితుల గురించి ఎక్కువ మాట్లాడతాం గాని దేవుని పనిని గురించి దేవుని రాజ్యం గురించి మనం మాట్లాడలేకపోతున్నాం. అందుకే దేవుడు మన ద్వారా గొప్ప కార్యాలు చేయలేకపోవుచున్నారు.

దావీదు చిన్నవాడు గొల్యాతు దావీదుకంటే చాలా పెద్దవాడు కాని దావీదు వడిసెల రాయితో గొల్యాతును పడగొట్టెను. దావీదు అంతకుముందు రాయితో ఎవ్వరిని కొట్టలేదు. మరి ఇప్పుడు ఎలా కొట్టగలిగాడు. దేవుని పనిచేయుటకు అనుభవం కాదు కావలసినది నిర్ణయము, సిద్ధమనస్సు. దేవుని పని చేయడానికి సిద్ధంగా ఉన్నామా? లేదా? ఆయన కార్యం చేయుటలో బలవంతుడు శక్తిమంతుడు. ఆయన ఎన్నడు తన ప్రజలను విడనాడువాడు కానే కాదు. దావీదు చిన్నవాడైయుండి గొల్యాతును చంపుతానంటున్నాడు అందుకే అన్నింటిని సమకూర్చాడాయన. గొల్యాతును చంపడానికి కత్తి లేదు కాని దేవుడే సమకూర్చారు అది కూడా గొల్యాతుదే. దావీదు గొల్యాతు మీదికి ఎక్కి చంపాడు. ఆ సమయంలో దేవుడు దావీదుకు ఆలోచన ఇచ్చారు. దావీదుకు ఆలోచన చెప్పిన దేవుడు నిర్ణయం ఉన్న నీకు ఎందుకు ఆలోచన చెప్పరు? మీ కుటుంబంలో ప్రభువు మీకు జయమిచ్చును గాక! మీరున్న పరిస్థితుల్లో ప్రభువు మీకు జయమిచ్చును గాక! విశ్వాసం ఘనపరచబడును గాక! మీరు వెళ్ళండి దేవుడు తన ఆత్మనిచ్చి నడిపిస్తారు.

సమూయేలుకు పరిస్థితులన్ని అనుకూలంగా లేవు. తాను దేవుని మందిరంలోనే ఉండాలని తల్లి నిర్ణయించి అతనిని విడిచిపెట్టినది. కాని మందిరములో ఉన్న ఏలీ కుమారులు దుర్మార్గులై పచ్చిమాంసం తింటు, ప్రత్యక్షపు గుడారం దగ్గరకు వచ్చిన స్త్రీలతో పాపం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పరిశుద్ధతను కాపాడుకోవడం సాధ్యమా? అసాధ్యమా? అక్కడ దేవుని మందిరంలో ఉండాలనే నిర్ణయం ఉంది సమూయేలుకు. ఏలీ చనిపోయాడు, ఏలీ కుమారులు చనిపోయారు ప్రత్యక్షపుగుడారం దగ్గర పాపం ఆగిపోయింది. పచ్చిమాంసం తినేవారు ఇకలేరు. ఇప్పుడు సమూయేలు ధూపం వేయువానిగా మారిపోయాడు. **సమూయేలు నిర్ణయం తన భక్తి జీవితానికి ద్వారాలు తెరిచింది**. నీకు ద్వారాలు తెరచి ప్రభువు కొరకు నిన్ను నడిపించేది నీ నిర్ణయమే. నీవు సుఖాన్ని విడిచి ఉపవాసప్రార్థన చేయాలనే నిర్ణయం ఉంటే ప్రభువు ద్వారాలు తెరుస్తారు. మందిరంలో మొరపెట్టలేని వారి కుటుంబాలలో సమస్యలెలాపోతాయి? నీ సమస్యలను తొలగించేది నీ చింతా? నీ ప్రార్థనా? దేవుని మందిరాన్ని వెదకండి.

ప్రియులారా! సమూయేలు దేవుని మందిరంలోనికి వచ్చిన తరువాత మందిరంలో కనబడే సమస్యలు ఇక లేనే లేవు. సమూయేలుకు మందిరంలో ఉండాలనే నిర్ణయం, రూతుకు దేవున్ని వెంబడించాలనే నిర్ణయం, దావీదుకు యుద్ధం చేయాలనే నిర్ణయం, యోబుకు దేవున్ని చూడాలనే నిర్ణయం, నోవాహుకు దేవుడు చెప్పింది చేయాలనే నిర్ణయం వారిని తిరుగులేకుండా చేసింది. మరి నీ నిర్ణయం ఏమిటి? మీ హృదయంలో ఉన్న ఆశలు ఏమిటి? మీరు తల పెట్టండి ప్రభువు ఎందుకు చేయరు? మీరు దైవచిత్తానుసారంగా తలపెట్టినప్పుడు ఎక్కడా ఓటమి ఉండదు. మనం యోచించినప్పుడు ఆయన చేస్తారు. నీవు ఒక్కడుగు ముందుకు వేస్తే ఆయన వెయ్యి అడుగులు ముందుకువేయించే దేవుడు. మీరేమి తలంచుచున్నారు గొప్పపని మనం ప్రభువు కొరకు చేయాలి. గొప్ప ఆలోచనతో పని చేయాలి. గొప్ప ప్రార్థనతో పనిచేయాలి. ప్రభువు రాజ్యాన్ని మనం కట్టాలి.

**సీమోను, సీమోను, ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమలవలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను గాని నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీ కొరకు వేడుకొంటిని" లూకా 22:31, 32.**

దేవుడు మనలను పరీక్షించేటప్పుడు గురి చూసి కొట్టేది మన విశ్వాసాన్నే. మనలోని ఏ లక్షణమైనా పరీక్షకు లోను కాకుండా పోవచ్చుగాని విశ్వాసం మాత్రం అలా తప్పించుకోలేదు. విశ్వాసాన్ని దాని మూలుగ (*Bone Marrow*) దాకా పరీక్షించడానికి దానిలోకి పదునైన బాణాన్ని గుచ్చడంకన్నా వేరే మార్గం లేదు. ఇందువల్ల ఆ విశ్వాసం శాశ్వతమైనదా, కాదా అన్నది తెలుస్తుంది. దానికున్న ఆనంద కవచాన్ని లాగేసి, ప్రభువు పంపించే శ్రమలను దానికి వ్యతిరేకంగా నిలబెట్టాలి. ఈ దాడులనుండి ఏ మాత్రం గాయపడకుండా బయటపడేదే నిజమైన విశ్వాసం. విశ్వాసం పరీక్షించబడాలి. అది దిక్కులేనిదైపోవాలి. కొలిమిలో అనేకసార్లు కాలాలి. ఈ పరీక్షలన్నింటినీ తట్టుకుని నిలబడిన విశ్వాసంగలవాడు ధన్యుడు.

పౌలు అన్నాడు "నా విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాను" కాని తన తలను పోగొట్టుకున్నాడు. అతని తలను నరికివేశారు గాని అతని విశ్వాసాన్ని మాత్రం తాకనైనా తాకలేకపోయారు. అన్యజనులకు అపొస్తలుడైన ఇతడు మూడు విషయాలలో సంతోషించాడు – 'మంచి పోరాటాన్ని పోరాడాడు', పరుగును కడముట్టించాడు, విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాడు ఫలితమేమిటి? పౌలు పందెంలో గెలిచాడు. బహుమతి పొందాడు. ప్రపంచం అతనిని గొప్పవాడిగా ఎంచింది. అంతేకాదు, పరలోకంలో ఇతడు ఘనడయ్యాడు. క్రీస్తులో విజయం సాధించడానికి అన్నిటినీ పోగొట్టుకున్నా అది లాభమే. ఈ దృష్టితో మనం ఎందుకు ప్రవర్తించం? పౌలులాగా సత్యానికి మనం ఎందుకు విధేయులం కాము? ఎందుకంటే పౌలు పాటించిన విధానం మనకు లేదు. మన లెక్కకూ అతని లెక్కకూ తేడా ఉంది. పౌలు నష్టం అని ఎంచిన వాటిని మనం లాభంగా లెక్కిస్తున్నాము. పౌలుకున్న విశ్వాసం మనకు ఉండాలి. అతనికి దొరికిన కిరీటం మనకు దొరకాలంటే ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2016-18

# సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

## స్థలము: హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము

## బుడంపాడు, గుంటూరు

## ప్రతి నెల 1 వ తేది

సమయం: రాత్రి గం॥9.00 ల నుండి ఉ॥5.00 గం॥ల వరకు

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : 9491475967, 9290901396

To,
Sri / Smt.

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 11th & 12th of Every Month